ప్రజాశక్తి
ఆదివారం 26 జనవరి 2025 5 అనంతపురం





టవర్‌క్లాక్ వద్ద నిరసన తెలుపుతున్న ఐక్య విద్యార్థి సంఘం నాయకులు

విద్యార్థి సంఘాల నిరసనాగ్రహం

◆ మంత్రి నారాయణ దిష్టిబొమ్మ దహనానికి యత్నం
◆ అడ్డుకున్న పోలీసులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య ఘటనపై ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధిత విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ నిరసనబాట పట్టారు. ఘటన జరిగి మూడు రోజులు అవుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడంపై మండిపడ్డారు. విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని, నారాయణ విద్యా సంస్థలను సీజ్ చేయాలని, ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి నారాయణ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఐక్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో శనివారం ఉదయం అనంతపురంలో పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. టవర్‌క్లాక్ వద్ద నారాయణ కళాశాల యజమాని నారాయణ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు యత్నించారు. పోలీసులు వారిని బలవంతంగా అడ్డుకున్నారు. ఈ సమయంలో పోలీసులు, విద్యార్థి సంఘం నాయకుల మధ్య తీవ్ర తోపులాట జరిగింది. ఈ సందర్భంగా ఐక్య విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ నారాయణ కళాశాలలో విద్యార్థి మరణంకు కారణం ఫీజుల ఒత్తిడే అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నారాయణ కళాశాలల్లో విద్యార్థుల మరణాల ఘటనలూ తరచూ జరుగుతూనే ఉన్నాయన్నారు. వందలాదిమంది విద్యార్థులు చనిపోయినప్పటికీ ఏ జిల్లాలో కూడా ఆ విద్యాసంస్థల పై కేసు నమోదు చేసిన దాఖలాలు లేవన్నారు. ప్రస్తుతం అనంతపురంలో కూడా కళాశాలపై ఇప్పటి వరకు ఎలాంటి కేసూ నమోదు చేయలేదన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థి మరణంపై స్పందించాలన్నారు. విద్యార్థి మరణానికి నైతిక బాధ్యత వహిస్తూ రాష్ట్ర మంత్రివర్గం నుంచి నారాయణను బర్తరఫ్ చేయాలన్నారు. కళాశాల యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. విద్యార్థి కుటుంబానికి రూ.కోటి ఆర్థిక ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. అనంతపురంలో నారాయణ విద్యాసంస్థలకు తొత్తుగా పనిచేస్తున్న జిల్లా ఆర్‌ఐఒ వెంకటరమణను వెంటనే విధుల నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, సంబంధిత ఉన్నతాధికారులు వీటిపై స్పందించకుంటే ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఓతురు పరమేష్, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి ఎన్‌ఎస్‌యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేష్, ఎఐఎస్‌బి జిల్లా కార్యదర్శి పత్వి, బీసీ,ఎస్సీ,ఎస్టీ మైనారిటీ విద్యార్థి సమైక్య రాష్ట్ర కార్యదర్శి సురేష్ యాదవ్, వైసిపి విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ యాదవ్, జనసేన విద్యార్థి విభాగం జిల్లా కార్యదర్శి సిద్ధు, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు సిద్ధు, జిల్లా ఉపాధ్యక్షులు గిరి, సోము, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు బ్రేక్..!





◆ బిల్లులు చెల్లించకపోవడంతో గుత్తేదారుల నిర్ణయం
◆ కమిషనర్ లాగిన్‌లో ఫైళ్ల పెండింగ్
◆ బిల్లులు ఇవ్వకుంటే పనులు చేయమన్న గుత్తేదారులు
◆ అనంత కార్పొరేషన్‌లో అభివృద్ధి పనులపై నీలినీడలు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం కార్పొరేషన్‌లో బిల్లుల చెల్లింపు వ్యవహారం అభివృద్ధి పనులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. చేసిన పనులకు నెలల తరబడి బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు ఇక పనులు చేయమంటూ చేతులెత్తేశారు. ఆదివారం గణతంత్ర దినోత్సవం రోజు నుంచి నగరంలో అభివృద్ధి పనులు ఏవీ చేయకూడదనే భావనకు కాంట్రాక్టర్లు వచ్చినట్లు తెలుస్తోంది. కార్పొరేషన్ పరిధిలో కమిషనర్ లాగిన్‌లో ఉన్న పెండింగ్ బిల్లులను క్లియర్ చేయాలని పలుమార్లు కాంట్రాక్టర్లు కమిషనర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు కలిసి విజ్ఞప్తి చేసుకున్నారు. అయినా ఎవరూ పట్టించుకోలేదు. ఇటీవల అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న బాధ్యతలు చేపట్టిన తర్వాత ఏ ఫైలునైనా ఆమె చూసిన తర్వాతనే వాటిని ముందుకు పంపుతామని కమిషనర్ కాంట్రాక్టర్ల వద్ద చెబుతున్నారు. కారణం ఏదైనా బిల్లుల చెల్లింపునకు సంబంధించిన ఫైళ్లు ముందుకు కదలకపోవడంపై కాంట్రాక్టర్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గడిచిన ఆరు నెలల కాలంలో కోటి రూపాయల బిల్లులు మాత్రమే వచ్చినట్లు తెలుస్తోంది. ఎప్పటికప్పుడు ఫైళ్లను పరిశీలించి వాటిని ముందుకు పంపకపోవడంతో నగరంలో అభివద్ధి పనులు ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి.



కమిషనర్ లాగిన్‌లో పెండింగ్

బిల్లుల చెల్లింపునకు సంబంధించి కమిషనర్ లాగిన్‌లో ఈ-ఆఫీసులో 500, సిఎఫ్‌ఎంఎస్‌లో 200 ఫైల్స్ పెండింగ్‌లో ఉన్నాయి. వీటికి సంబంధించిన అన్ని బిల్లులూ ఆగిపోయాయి. కొందరు గుత్తేదారులు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు రాధాకృష్ణ, షాకీర్ హుస్సేన్‌లను కలిసి కమిషనర్ లాగిన్‌లోని ఫైళ్లు చాలా ఉండిపోయాయని, వీటిని ముందుకు పంపకపోతే అభివృద్ధి పనులు చేయమని చెప్పారు. అయినా ఈ ఫైళ్లు ముందుకు కదిలే పరిస్థితి ఇప్పట్లో కన్పించడం లేదు. నూతన ప్రభుత్వం ఏర్పాటైన ఆరు నెలల కాలంలో రూ.5కోట్ల వ్యయంతో 25 అభివద్ధి పనులకు టెండర్ నిర్వహించారు. ఇంకా రూ.10కోట్ల వ్యయంతో కూడిన 41 అభివద్ధి పనులకు టెండర్లు నిర్వహించాల్సి ఉంది. గడచిన మూడు నెలల కాలంగా కమిషనర్ల లాగిన్లలోనే సిఎఫ్‌ఎంఎస్, ఈ-ఆఫీసులో పెద్ద ఎత్తున బిల్లులు, ఫైల్స్ కమిషనర్ లాగిన్లలోనే పెండింగ్‌లో నిలిచిపోవడంతో కాంట్రాక్టర్లు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఓ వైపు గుత్తేదారులు ఇబ్బంది పడుతున్నా, నగరంలో అభివృద్ధి పనులు ఆగినా బిల్లులు చెల్లింపుపై అధికారులు మాత్రం ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. ఇటీవల మున్సిపల్ పరిపాలన శాఖ డైరెక్టర్ హరినారాయణ అనంతపురం నగర పర్యటన సందర్భంగా అభివృద్ధి పనులపై అధికారులు, గుత్తేదారులతో మాట్లాడారు. ఆగిని పనులను పూర్తి చేయాలని కోరగా కాంట్రాక్టర్లు చిన్నచిన్న పనులను పూర్తి చేశారు. పనులు పూర్తి చేయించుకున్న అధికారులు బిల్లులు చెల్లింపుపై మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంపై కాంట్రాక్టర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆగనున్న అభివృద్ధి పనులు..!

కార్పొరేషన్‌లో గడిచిన మూడు నెలల కాలంలో ఇద్దరు కమిషనర్లు మారి మూడో కమిషనర్ వచ్చారు. వీరు మారుతున్నా కమిషనర్ లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లకు మోక్షం లభించలేదు. మూడో కమిషనర్ బాధ్యతలు చేపట్టి 15 రోజులు కావస్తున్నా ఒక్క ఫైల్ కూడా ముందుకు కదల్లేదు. రూ.50 లక్షలకుపైగా కంటింజెంట్ బిల్లులున్నా ఒక్క రూపాయి కూడా మంజూరు కాలేదు. ఇలాంటి పరిస్థితుల్లో సొంత డబ్బులు వెచ్చించి పనులు చేసి ఆర్థికంగా ఇబ్బందులు పడటం కంటే ఆపేయడమే మంచిదన్న భావనలో గుత్తేదారులు ఉన్నారు. పనులు ఆపేయాలని కాంట్రాక్టర్ల తీసుకున్న నిర్ణయంతో గణతంత్ర దినోత్సవం రోజు నుంచి అభివృద్ధి పనులకు బ్రేక్ పడనున్నట్లు తెలుస్తోంది. దీనిపై అధికారులు, ముఖ్య ప్రజాప్రతినిధులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.

ఆదర్శ సేవలకు గుర్తింపు

అవార్డు అందుకున్న అనంత కలెక్టర్



ప్రశంసాపత్రం అందుకుంటున్న కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

2024లో ఎన్నికల నిర్వహణలో ఆదర్శప్రాయమైన సేవలు అందించిన అనంతపురం కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా॥వి.వినోద్ కుమార్ అవార్డు అందుకున్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం-2025 సందర్భంగా ఉత్తమ సేవలకు గుర్తింపుగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు. 2024వ సంవత్సరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన ఎన్నికల సందర్భంగా అనంతపురం జిల్లాలో ఎన్నికలను కలెక్టర్ వినోద్ కుమార్ ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తి పారదర్శకతతో నిర్వహించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను నిర్వహించినందుకు కలెక్టర్‌ను "ఉత్తమ ఎన్నికల నిర్వహణ అవార్డు"కు ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో విజయవాడ నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గారి చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు.

డ్యాన్స్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

లహరి డాన్స్ ఫిట్నెస్ అకాడమీ రజతోత్సవాలను పురస్కరించుకుని శనివారం నగరంలోని టిటిడి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన డ్యాన్స్ పోటీలను జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ప్రారంభించారు. ఇందులో భాగంగా విద్యార్థులను చేసిన నృత్యాలను తిలకించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ మేయర్ మహమ్మద్ వసీం, డిప్యూటీ మేయర్లు కొగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య, డాన్స్‌మాస్టర్ జయ, డాన్స్ మాస్టర్లు, పురప్రముఖులు, ఔత్సాహికులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు నడుం బిగించాలి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్


ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యమైన భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. శనివారం నగరంలోని ఎస్-ఎస్‌బిఎన్ కళాశాలలో రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎస్‌బిఎన్ కళాశాల కరస్పాండెంట్ నిర్మల, ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, మహాబోధి కృష్ణమూర్తి మాట్లాడుతూ దేశం ఇన్ని సంవత్సరాలుగా మనుగడ సాగించడానికి కారణం భారత రాజ్యాంగమే అన్నారు. ఈ విషయాన్ని రాజ్యాంగానికి హృదయమైన పీఠిక వివరిస్తుందన్నారు. అలాగే పీఠికలో దేశాన్ని ఎలా తీర్చిదిద్దుకోవాలనే విషయాన్ని సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర అనే భావనలతో వివరించినట్లు తెలిపారు. రాజ్యాంగం భారతదేశ ప్రజలైన మనకు సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని, ఆలోచన, విశ్వాసం, ధర్మం, ఆరాధనలో స్వాతంత్ర్యంతో పాటు అవకాశాల్లోనూ సమానత్వాన్ని చేకూర్చాలని చెబుతూ ప్రతిఒక్కరిలో వ్యక్తి గౌరవాన్ని జాతీయ సమైక్యతను కాపాడి సౌభ్రాతత్వాన్ని పెంపొందించుకోవాలన్నారు. అదేవిధంగా విద్యారంగంలో అనేకమైన మార్పులు వస్తున్న నేపథ్యంలో విద్యార్థులపై రూపాల్లో దాడులు జరుగుతున్నాయన్నారు. అనంతరం విద్యార్థులు మద్యపానానికి ఎలా దూరంగా ఉండాలి.. చదువులుపై నిర్లక్ష్య వ్యవహారాన్ని మానుకోవాలి.. భారతదేశ నవ సమాజ నిర్మాణం కోసం అనేకమంది ఆలోచించి నూతన భారతదేశాన్ని నిర్మాణం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓతూరు పరమేష్, సిద్ధు, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా గర్ల్స్ కన్వీనర్ రజిత, ఉపాధ్యక్షుడు గిరి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకులు గణేష్, సోము, సాయి, అజయ్, లోకేష్, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు శ్యామల, నాయకురాలు చంద్రిక, అశ్విని, రామాంజనమ్మ, తదితరులు పాల్గొన్నారు.

'రాజ్యాంగ పీఠిక' కార్యక్రమంలో వక్తలు



అనంతపురం ఎస్ఎస్‌బిఎన్ కళాశాలలో ప్రతిజ్ఞ చేయిస్తున్న వక్తలు

గుంతకల్లు : భారత రాజ్యాంగ పీఠికపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని పలువులు వక్తలు సూచించారు. శనివారం స్థానిక రాజేంద్రనగర్‌లో ఉన్న శ్రీచైతన్య పాఠశాలలో డివైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ, ఐద్వా ఆధ్వర్యంలో విద్యార్థులతో రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా శ్రీచైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ వీరేష్‌బాబు, ఎస్‌ఎఫ్‌ఐ మాజీ రాష్ట్ర కార్యదర్శి కసాపురం రమేష్, డివైఎఫ్‌ఐ పట్టణ కార్యదర్శి సురేంద్రబాబు మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యమైన మనదేశ మనుగడ సాగించడానికి కారణం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఎంతోదూర దృష్టితో రచించిన రాజ్యాంగం అన్నారు. రాజ్యాంగ పీఠికలో భారతదేశాన్ని ఎలా తీర్చిదిద్దుకోవాలనే విషయాన్ని సర్వసత్తాక, సామ్యవాద,లౌకిక, ప్రజాస్వామ్య గణతంత్ర అనే భావనలతో వివరించారన్నారు. అన్నివర్గాల ప్రజలు, బడుగు, బలహీనులకు రాజ్యాంగమే అండ అన్నారు. అలాంటి రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ చదివి తమ హక్కులు, బాధ్యతలను తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మహిళా సంఘం పట్టణ కార్యదర్శి రంగమ్మ, ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ కార్యదర్శి వెంకీ, నాయకులు చందు, తదితరులు పాల్గొన్నారు.



గుంతకల్లులో రాజ్యాంగ పీఠికపై అవగాహన కల్పిస్తున్న వక్తలు

అభివృద్ధి చేసి రుణం తీర్చుకుంటా..

మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-తాడిపత్రి



అబ్దుల్ రహీం, సరస్వతిని సన్మానిస్తున్న జెసి ప్రభాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు

'నేను అందరివాడిని.. అభివృద్ధి చేసి నాకు సహకరించిన వారందరికీ రుణం తీర్చుకుంటా' అంటూ మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ వైస్‌ఛైర్మన్ పదువులకు రాజీనామా చేసిన అబ్దుల్ రహీం, సరస్వతిని శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ కౌన్సిలర్లు అందరూ చాలా కష్టపడి తనకు అండగా నిలిచారని భావోద్వేగానికి లోనయ్యారు. కౌన్సిల్ సభ్యులతోనే రెండు రాష్ట్రాల్లో ప్రత్యేక గౌరవం వచ్చిందన్నారు. తాడిపత్రిని అభివృద్ధి పథంలో నడిపించి దేశంలోనే ప్రత్యేక గుర్తింపు తీసుకురావడమే తన ఆశయం, ఆకాంక్ష అన్నారు. ఇందుకోసం ఎవరికైనా ఇబ్బంది కలిగి ఉంటే క్షమించాలని విజ్ఞప్తి చేశారు. రానున్న ఆరుమాసాల్లో మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయని.. కష్టపడి పనిచేసిన ప్రతి కౌన్సిలర్‌కు అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ శివరామకృష్ణ, టిడిపి కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పిల్లల ఆట స్థలం ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురంరూరల్

అనంతపురం అర్బన్ సెయింట్ అగస్టీన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన పిల్లల ఆట స్థలాన్ని ఎంపి అంబిక లక్ష్మీనారాయణ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ బిడ్డల భవిష్యత్తుకు మరిన్ని సౌకర్యాలు అందించడంలో కృషి చేస్తున్న అగస్టీన్స్ పాఠశాల యాజమాన్ని, ఆట స్థలం ఏర్పాటుకు ఆర్థికసాయం చేసిన క్యాటరింగ్ రవికాంత్ రమణను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది, పిల్లలు పాల్గొన్నారు.



ఆటస్థలాన్ని ప్రారంభించి పరికరాలను పరిశీలిస్తున్న ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు

హామీల అమలుకు పోరాటం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం సిపిఎం ఆధ్వర్యంలో పోరాటాలు కొనసాగిస్తామని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్ తెలియజేశారు. శనివారం గణేనాయక్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారంలోకి రాకముందు సూపర్ సిక్స్ హామీలు అమలు చేస్తామని, ప్రజల పైన భారాలను తగ్గిస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీలు అమలు చేయలేదన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేలుకుని సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలన్నారు. పెంచిన కరెంటు ఛార్జీలను తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వీటిన్నింటి కోసం ప్రజల పక్షాన సిపిఎం రాబోవు కాలంలో పోరాటాలు చేస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి రామి రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు ఆర్‌వి.నాయుడు, వెంకట నారాయణ, ముత్తుజ, నగర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రకాష్, గోపాల్, ఇర్ఫాన్, నగర కమిటీ సభ్యులు ఓబులేసు, రాజు, శీనా, బాలకృష్ణ, గఫూర్, ఎర్రి స్వామి, తిరుమలేసు, శంషాద్, లాలెమ్మ, మాబున్నీ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వి.రాంభూపాల్

పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా

నైపుణ్యాలు పెంచుకోవాలి

జెఎన్‌టియు ప్రిన్సిపల్ పి.చెన్నారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంచుకునేందుకు బెంగళూరు ఎయాన్సీ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్‌తో చేసుకున్న ఒప్పందం చాలా ఉపయోగపడుతుందని జెఎన్‌టియు ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి అన్నారు. శనివారం స్థానిక జెఎన్‌టియులోని ఇసిఇ విభాగం సెమినార్ హాలులో విభాగ అధిపతి జి.మమత అధ్యక్షతన బెంగళూరు ఎయాన్సీ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్-అనంతపురం జెఎన్‌టియు మధ్య (ఎంఒయు) అవగాహన ఒప్పదం కుదుర్చుకున్నారు. ఇందులో భాగంగా ఒప్పందం లక్ష్యాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ, ఇంటర్న్‌షిప్, పరిజ్ఞానం పంచుకోవడం కోసం ఈ ఒప్పందం చేసుకున్నట్లు వివరించారు. విద్యార్థులు ఈ ఒప్పందాన్ని సద్వినియోగం చేసుకుని పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను మరింత అభివృద్ధి చేసుకోవాలని కోరారు. విద్యార్థులకు కొత్త అవకాశాలను తెలిపి వారి కెరీర్‌ను పురోగతి పథంలో నడిపించేందుకు దోహదం చేయనుందన్నారు. ఎయాన్సీ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ బెంగళూరు ప్రతినిధి జయప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన శిక్షణ, పరిశోధనా మార్గదర్శకత్వం అందించడానికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జి.మమత, వి.సుమలత, రమణారెడ్డి, ఎస్.అరుణమస్తాని, మాజీ ఆచార్యులు ఎంఎన్.గిరిప్రసాద్, ఎయాన్సీ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ సిఇఒ జయప్రకాష్, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



ఎంఒయు పత్రాలను చూపుతున్న జెఎన్‌టియు ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, తదితరులు



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న టిడిపి నేతలు

కల్లుగీత కార్మికుల సంబరాలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

మద్యం దుకాణాలను కేటాయించడంపై గౌడ, ఈడిగ కులస్థులు శనివారం నరంలోని అనంతపురం అర్బన్ టిడిపి కార్యాలయంలో సంబరాలు చేసుకున్నారు. ఇందులో భాగంగా టిడిపి నాయకుడు గోపాల్ గౌడ్ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ఈడిగ, గౌడ కులస్థులు ఎమ్మెల్యే దగ్గుపాటిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సిఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి ఫెడరేషన్, కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల లక్ష్మీనరసింహులు, శ్రీనివాసులుగౌడ్, నాగభూషణంగౌడ్, శంకర్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్, జిల్లా టిడిపి అధికార ప్రతినిధి సరిపూటి రమణ, దత్తాత్రేయ ఆలయ కమిటీ ఛైర్మన్, టిడిపిపి నాయకుడు రాయల్ మధు, పార్లమెంటు మీడియా కో ఆర్డినేటర్ కూచి హరి, బెస్త సాధికారిక రాష్ట్ర సభ్యుడు చేపల హరి, తదితరులు పాల్గొన్నారు.

'పివికెకెలో' ముగిసిన సాంకేతిక సదస్సు

ప్రజాశక్తి-అనంతపురం

నగర సమీపంలో ఉన్న పివికెకె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో రెండు రోజులపాటు ఆప్టిట్యూడ్, లాజికల్ రీజనింగ్ స్కిల్స్‌పై నిర్వహించిన ప్రత్యేక వర్క్‌షాప్ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఐ కేర్ అకాడమీ ఫౌండర్ ఎం.దుర్గానాగేష్, టెక్నికల్ అసోసియేట్ గురుదత్ కలిసి విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యాలు, ఆలోచనా శక్తిని పెంపొందించేందుకు దోహదపడే అంశాలను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు మాట్లాడుతూ రెండు రోజుల వర్క్‌షాప్ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడంలో, వారి భవిష్యత్తు అవకాశాలను మెరుగు పరచడంలో కీలకపాత్ర పోషించిందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి ఉపయోగపడతాయన్నారు. భవిష్యత్తులో మరిన్ని వర్క్‌షాప్‌లు నిర్వహించడానికి తగిన ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన విభాగాధిపతి దిలీప్‌కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ధరణి, వక్తలు, విద్యార్థులను కళాశాల ఛైర్మన్ పల్లె కిషోర్, కోశాధికారి పల్లె సింధూర, యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, ఎఒ మనోహర్‌రెడ్డి, తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.



సాంకేతిక సదస్సులో మాట్లాడుతున్న వక్త

చదువు 'కొనలేం'..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



అనంతపురం జిల్లా అనగానే కరువు.. రైతు ఆత్మహత్యలు గుర్తుకు వస్తాయి. పంటలు పండక వాటి కోసం అప్పులు చేసి తీర్చే మార్గం లేక అన్నదాతల బలవన్మరణాలు జరుగుతూ వచ్చాయి. ఇవి ఇప్పటికీ కొనసాగుతున్నప్పటికీ ఇటీవలి కాలంలో తమలాంటి బతుకులు తమ పిల్లలకు వద్దని.. చదివించి ప్రయోజకులను చేయాలని రైతులు భావిస్తున్నారు. అందుకోసం మంచి కళాశాలలో చేర్పిస్తే తమ పిల్లల భవిష్యత్ మారుతుందని ఆశలు పెట్టుకుని చేరుస్తున్నారు. కాని ఆ కళాశాలల్లో చదువుతున్న సమయంలో అసలు కష్టాలు వారికి కన్పిస్తున్నాయి. సాగు కష్టాలు పోయి.. చదువు కష్టాలు వారిని వెంటాడుతున్నాయి. పిల్లల కోసం తీసుకుంటుండగానే చదువుల భారాన్ని మోయాల్సి వస్తోంది. ఈ మోసే క్రమంలో భారమైనా బరువును దింపుకోలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈ ప్రభావం పిల్లలపైనా పడుతోంది. ఫలితంగా పిల్లలు ఆత్మహత్యల వైపు వెళ్తున్నారు. ఇందుకు సజీవ సాక్ష్యమే మూడు రోజుల క్రితం అనంతపురంలో నారాయణ కళాశాలకు చెందిన చైతన్య అనే విద్యార్థి ఆత్మహత్య ఉదంతం. రోజు కష్టం చేసుకునే తమలాంటి బతుకు పిల్లలకు వద్దని చైతన్య తండ్రి ఆశించాడు. తన ఇద్దరు కుమారులకు మంచి విద్యను అందివ్వాలని సంకల్పించాడు. ఈ చదువుల భారం శక్తికి మించి ఉంది. పెద్ద కుమారుడు బీటెక్‌కు రూ.3.90 లక్షలు, చిన్న కుమారుడు చైతన్యకు రూ.1.70 లక్షలు ఇలా ఇద్దరినీ చదించడంలో అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. అయినా పిల్లల కోసం ఈ కొద్ది కష్టపడి గట్టెక్కిస్తే వారి భవిష్యత్, తమ భవిష్యత్ మారుతుందని ఆశించాడు. ఈ క్రమంలోనే చిన్నకుమారుడి ఫీజు కట్టడం కాస్త ఆలస్యమైంది. దయలేని కార్పొరేట్ కళాశాల యాజమాన్యం ఫీజు ఒత్తిడిని విద్యార్థిపై పెంచింది. తోటి విద్యార్థుల ఎదుట అవమానపరచింది. ఈ అవమానభారాన్ని భరించలేక ఆ విద్యార్థి కళాశాల భవనం పై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విద్యార్థుల ఫీజుల కష్టాలను తెలిపే ఈ ఘటన మాత్రమే ఇది.. ఇంకా అనేక మంది విద్యార్థులు ఫీజుల ఒత్తిడి మధ్య నలిగిపోతున్నారు. ఇంత జరుగుతున్నా పాలకులు కార్పొరేట్, ప్రయివేటు కళాశాలలను నియంత్రించే చర్యలు తీసుకుంటున్న దాఖలాల్లేవు. ప్రజలకు మెరుగైన భవిష్యత్ అందిస్తున్నామని పాలకులు ఒకవైపు ప్రకటనలు చేస్తున్నారు. విజన్ మీద విజన్లు విడుదల చేస్తున్నారు. అయితే సామాన్యుడికి ఉత్తమ విద్యను అందించే చర్యలు మాత్రం నామమాత్రంగానే ఉంటున్నాయి. ఇది చాలన్నట్టు నూతన విద్య విధానం అని ఒకదాన్ని తీసుకొచ్చి మరింత ప్రయివేటుపరం చేసేందుకు సిద్ధమవుతున్నారు. ప్రజల సంపాదనలో అత్యధిక విద్యకు, వైద్యానికే ఖర్చు పెడుతున్నారని అనేక నివేదికలు చెబుతున్నాయి. వీటి భారాన్ని తగ్గించే చర్యలేవి ప్రభుత్వం తీసుకోకపోగా మరింత భారాలను మోపే విధంగా నిర్ణయాలు ఉంటున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం విద్య, వైద్యం ఖర్చులను తగ్గించే చర్యలు తీసుకోవాలని సామాన్యులు కోరుతున్నారు.

'నారాయణ'పై చర్యలు తీసుకోవాలి

విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి-రాయదుర్గం

విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న నారాయణ కళాశాలల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ, ఎఐఎస్‌ఎఫ్, ఎన్‌ఎస్‌యుఐ నాయకులు డిమాండ్ చేశారు. అనంతపురంలో నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న చరణ్ ఆత్మహత్యను నిరసిస్తూ శనివారం రాయదుర్గంలో విద్యార్థి సంఘాల నాయకులు నిరసన తెలిపారు. ఇందులో భాగంగా రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు బంగి శివ, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కోశాధికారి ఆంజనేయులు, ఎన్‌ఎస్‌యుఐ జిల్లా నాయకులు అనిల్ మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి లక్షలకు లక్షలు ఫీజులు వసూలు చేసే దాని మీద ఉన్న శ్రద్ధ విద్యార్థుల ప్రాణాలు కాపాడడంలో నారాయణ విద్యాసంస్థలకు లేదని మండిపడ్డారు. అనంతపురం నారాయణ కళాశాలలో విద్యార్థి మరణిస్తే ఇంతవరకు కనీసం విచారణ చేపట్టకపోవడం బాధాకమరన్నారు. నారాయణ విద్యాసంస్థలకు వత్తాసుగా పని చేస్తున్న ఆర్‌ఐఒను సస్పెండ్ చేయాలన్నారు. నారాయణ విద్యాసంస్థలపైన చర్యలు తీసుకోవడానికి భయం ఉంటే ఆర్‌ఐఒ తన పదవికి రాజీనామా చేసి వెళ్లిపోవాలని హెచ్చరించారు. లేనిపక్షంలో జిల్లావ్యాప్తంగా ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు వలి, అనిల్, గణేష్, ఇర్ఫాన్, వంశీ, దేవరాజ్, ఎఐఎస్‌ఎఫ్ నాయకులు రాజు, తరుణ్, మున్నా, భాను, అభి, విష్ణు, పవన్, రాజు, ఎన్‌ఎస్‌యుఐ నాయకులు దిలీప్, శ్రీకాంత్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు

వ్యాపార నగరంగా అనంతపురం

ఎంపి అంబికా, ఎమ్మెల్యే దగ్గుపాటి

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం నగరం వ్యాపారపరంగా విస్తరించడంతోపాటు వ్యాపారాలు, చిన్నపాటి పరిశ్రమల స్థాపనకు అనుకూలమైన వాతావరణం ఉందని ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. నగరంలోని రామ్‌నగర్ 80 ఫీట్ రోడ్డులో ఉన్న మైత్రివనం హోటల్ వద్ద ఏర్పాటు చేసిన విజేత సూపర్ మార్కెట్ 114వ బ్రాంచును ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, హిందూపురం ఎంపి పార్థసారథితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1999 నుంచి విజేత సూపర్‌మార్ట్ గురించి తెలుసున్నారు. హైదరాబాదులోని చందానగర్‌లో మొదటి బ్రాంచును ప్రారంభించారన్నారు. ఈ బ్రాంచు వ్యవస్థాపకులు జగన్మోహన్‌రావు నాణ్యతకు, నమ్మకానికి బ్రాండ్‌గా ఉండే వారన్నారు. ఇప్పుడు ఆయన కుమారుడు సందీప్ ఆధ్వర్యంలో ఇక్కడ మార్ట్ ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు.



విజేత సూపర్ మార్కెట్‌లో ఎంపిలు, ఎమ్మెల్యేలు

'క్యాట్' ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థుల విజయ దుందుభి

ప్రజాశక్తి-అనంతపురం



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ఎజిఎం

క్యాట్ రెండవ రౌండ్ ఫలితాల్లో అనంతపురం జోన్‌కు చెందిన శ్రీచైతన్య విద్యార్థులు అత్యధికంగా అవార్డులను కైవసం చేసుకున్నట్లు శ్రీచైతన్య విద్యాసంస్థల ఎజిఎం సుబ్బారెడ్డి తెలిపారు. శనివారం నగరంలోని కమ్మభవన్ సమీపంలోని శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఎజిఎం మాట్లాడుతూ రూ.2వేల క్యాష్ ప్రైజ్ నలుగురు, రూ.వెయ్యి క్యాష్ ప్రైజ్ 167 మంది విద్యార్థులు గెలుపొందినట్లు తెలిపారు. మొత్తంగా 1582 మంది విద్యార్థులు విజయభేరి మోగించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు విశ్వనాథ్, సమీనా ఖాన్, తబసుం, నేత్రావతి, వెంకటేష్, కరీమ్, కోఆర్డినేటర్లు రాధాకృష్ణ, తిరుమలేష్, నాగభూషణ్, ఇర్షాద్, డీన్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కూలీ కుటుంబాన్ని ఆదుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి-పుట్లూరు



నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

మండలంలోని ఓబుళాపురం ఎస్‌సి కాలనీకి చెందిన కూలీ హరిజన పుల్లయ్య (45) కుటుంబాన్ని ప్రభుత్వం ఆదురోవాలని సిపిఎం మండల కార్యదర్శి సూరి డిమాండ్ చేశారు. శుక్రవారం రాత్రి అకస్మాత్తుగా మృతిచెందిన పుల్లయ్య ఇంటికి సిపిఎం నాయకులు చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ పెద్ద దిక్కు కోల్పోవడంతో పుల్లయ్య భార్య, ఇద్దరు పిల్లల జీవనాధారం కష్టంగా మారిందన్నారు. కావున బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని కోరారు. నివాళులర్పించిన వారిలో రైతుసంఘం మండల కార్యదర్శి జి.వెంకటచౌదరి, కెవిపిఎస్ మండల కార్యదర్శి నాగభూషణం, తదితరులు ఉన్నారు.

ఆటో స్టాండ్ సమస్య పరిష్కరించాలని వినతి



ఆకుల బాబుతో మాట్లాడుతున్న ఆటో డ్రైవర్లు

నార్పల : మండల కేంద్రంలో ఆటోస్టాండ్ సమస్యను పరిష్కరించాలని పలువురు ఆటో డ్రైవర్లు కోరారు. ఈమేరకు శనివారం మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో మండల నాయకులు ఆకుల విజయ్‌కుమార్‌కు కలిసి సమస్యలపై విన్నవించారు. ఇందుకు స్పందించిన ఆకుల బాబు సమస్యను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఢిల్లీ గణతంత్ర దినోత్సవ వేడుకలకు 'అనంత' విద్యార్థులు



ఢిల్లీ పరేడ్‌లో పాల్గొననున్న విద్యార్థులు

అనంతపురం : నగరంలోని ప్రభుత్వ కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో చదువుతున్న ముగ్గురు ఎన్‌సిసి విద్యార్థులు ఢిల్లీలో జరగనున్న గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొననున్నట్లు ప్రిన్సిపాల్ పి.పద్మశ్రీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

పెద్దాసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యునిగా గంగారాం



గంగారామ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

అనంతపురం రూరల్ : అనంతపురం పెద్దాసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యునిగా టిడిపి సీనియర్ నాయకులు కోనంకి గంగారామ్ నియమితులయ్యారు. ఈమేరకు శనివారం నగరంలోని అర్బన్ టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అభినందనలు తెలిపారు. తర్వాత బొకే అందజేసి శాలువాతో సత్కరించారు. ఆసుపత్రిలో నెలకొన్న సమస్యల్ని పరిష్కరిస్తూ, అందరికీ నాణ్యమైన వైద్యం అందేలా కృషి చేయాలని ఎమ్మెల్యే దగ్గుపాటి సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి బుగ్గయ్య చౌదరి, నాయకులు పోతుల లక్ష్మీనరసింహులు, పరమేశ్వర్, కడియాల కొండన్న, రాయల్ మధు, ముక్తియార్, సరిపూటి రమణ, కూచి హరి, నాయకులు నెట్టెం బాలకృష్ణ, గోపాల్‌గౌడ్, చేపల హరి, బండి కాశీ విశ్వనాథ్, జోగి రాజేంద్ర, ఈడిగ నాగభూషణం, వడ్డే వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.


రేషన్ సక్రమంగా అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ మునివేలు

బొమ్మనహాళ్ : మండలంలోని డీలర్లు లబ్ధిదారులకు సక్రమంగా రేషన్ సరుకులు అందించాలని తహశీల్దార్ మునివేలు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ దుకాణం ద్వారా 1వతేదీనే తప్పనిసరిగా రేషన్ అందించాలన్నారు. ఎక్కడైనా రేషన్ ఇవ్వనట్లు తెలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా బఫర్‌పేరుతో తమకు బియ్యం తక్కువగా ఇస్తున్నారని పలువురు డీలర్లు వాపోయారు. ఇందుకు తహశీల్దార్ స్పందిస్తూ మీ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ శ్యామ్, డీలర్ల సంఘం అధ్యక్షులు మోహన్, డీలర్లు పాల్గొన్నారు.

రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు పంపిణీ



ట్రాన్స్‌ఫార్మర్లను అందజేస్తున్న అధికారులు

కళ్యాణదుర్గం రూరల్ : కళ్యాణదుర్గం, కంబదూరు మండలాల్లోని రైతన్నలకు మంజూరైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను శనివారం మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కరణం రామ్మోహన్‌చౌదరి, మోరేపల్లి మల్లికార్జున, గాజుల శ్రీరాములు, అమిలినేని లక్ష్మీనారాయణ, ముదిగలు శ్రీనివాస్‌రెడ్డి, రాజశేఖర్, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

విమర్శలు మాని.. అభివృద్ధికి సహకరించాలి

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం



రాజీనామా పత్రాన్ని చూపుతున్న జడ్పిటిసి ప్రభావతమ్మ

వైసిపి నాయకులు విమర్శలు మాని చేతనైతే అభివృద్ధికి సహకరించాలని జడ్పిటిసి ప్రభావతమ్మ సూచించారు. శనివారం మండల నాయకులతో కలిసి స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ తాను 2024 జూలై 2వతేదీనే అప్పటి వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్యకు రాజీనామా లేఖను అందజేశానన్నారు. ఎమ్మెల్యే సురేంద్రబాబు చేస్తున్న అభివృద్ధిని చూసి ఆరునెలల క్రితమే టిడిపి సభ్యత్వాన్ని తీసుకున్నానన్నారు. అలాంటిది ఇప్పుడు తనను సస్పెండ్ చేయడం ఏంటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కురు గౌడ, నీలాస్వామి, శివశంకరప్ప, శ్రీరాములు, రాజశేఖర్ గౌడ, వెంకటేశులు, రామ్మోహన్ చౌదరి, మంజులా వన్నూరు స్వామి, సర్పంచు వనితా మల్లికార్జున, హనుమంతప్ప, లింగన్న, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

ఉరవకొండ : మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని వజ్రకరూరు సర్పంచు మోనాలిసా పిలుపునిచ్చారు. శనివారం వజ్రకరూరు మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో ఎపిఎం లలిత ఆధ్వర్యంలో మండల స్థాయి సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ వాలంటీర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆర్థిక పురోగతి సాధించి అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలన్నదే ప్రభుత్వం చేపట్టిన ఉల్లాస్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. అనంతరం ఇందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి దామోదర్‌రెడ్డి, ఎంఇఒ ఎర్రిస్వామి, వెలుగు సీసీలు, యానిమేటర్లు, మహిళా సంఘాల లీడర్లు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కౌకుంట్ల విఆర్వోకు ఉత్తమ అవార్డు

ఉరవకొండ : ఉత్తమ బిఎల్‌ఒగా ఉరవకొండ మండల పరిధిలోని కౌకుంట్లలో వీఆర్వోగా విధులు నిర్వహించిన సి.అంజలి ఎంపికయ్యారు. జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర ఎన్నికల అధికారి వివేక్ యాదవ్‌తో కలెక్టర్ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో రివార్డు అందుకున్నారు. ప్రస్తుతం సి.అంజలి కనేకల్ మండలంలో విధులు నిర్వహిస్తున్నారు.

రథసప్తమి ఆహ్వాన పత్రికలు విడుదల

ఉరవకొండ : మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నఅహోబిలంలో వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో వచ్చేనెల 4వతేదీన నిర్వహించనున్న రథసప్తమి ఆహ్వానపత్రికలను శనివారం స్థానిక ఆలయంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ రమేష్‌బాబు, టిడిపి నాయకులు విజయభాస్కర్, మారెన్న, సుంకరత్నమ్మ, నాగరాజు, రాంబాబు, గోవిందు, తదితరులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలు



పంటకోత ప్రయోగాలు చేస్తున్న అధికారులు

పుట్లూరు : మండల పరిధిలో వివిధ గ్రామాల్లో రైతులు సాగు చేసిన పప్పుశనగ పొలాల్లో అధికారులు శనివారం పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. ఇందులో భాగంగా మండల కేంద్రంతోపాటు కడవకల్లు, కోమటికుంట్ల, గరుగుచింతలపల్లి గ్రామాల్లో పంటకోత ప్రయోగాలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో సహాయ వ్యవసాయ సంచాలకులు చెంగళరాయుడు, మండల వ్యవసాయ అధికారిణి కాత్యాయిని, వ్యవసాయ విస్తరణ అధికారి సూర్య హరిబాబు, విలేజ్ సెరికల్చర్ అసిస్టెంట్ సర్ఫరాజ్, వీఎఎ భార్గవి, ఎంపిఇఒ సూర్యనారాయణరెడ్డి, విహెచ్‌ఎ మనోరమ, బీమా ఏజెంట్ షమీర్, విఆర్‌ఎ అంకన్న, పుల్లయ్య, రైతులు పాల్గొన్నారు.

హెల్మెట్ వాడకంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

పెద్దపప్పూరు : హెల్మెట్ వాడకంపై శనివారం మండల కేంద్రంలో డప్పు కళాకారులతో అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా కళాకారులు పాటల పాడుతూ హెల్మెట్ వాడటం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలన్నారు. అలాగే నాలుగు చక్రాల వాహనదారులు సీట్ బెల్ట్ పెట్టుకోవాలన్నారు. ఆటోల్లో పరిమితికి మించి జనాన్ని తరలించరాదన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీస్‌సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం గొప్పది



అన్నదానం చేస్తున్న కుసుమగిరి సిఇఒ నరసింహమూర్తి

కుందుర్పి : అన్నిదానాల కన్నా అన్నదానం చేయడమే ఎంతో గొప్ప అదృష్టమని కుసుమగిరి రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ సిఇఒ నరసింహమూర్తి అన్నారు. శనివారం మండల కేంద్రంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుసుమగిరి రైతు ఉత్పత్తిదారుల కంపెనీ నుంచి అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ లక్ష్మీపతి, కుసుమగిరి సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు నాగభూషణ, అనుమప్ప, లోకేశ్వరప్ప, అనసూయమ్మ, కదిరప్ప, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

యల్లనూరులో దొంగల హల్‌చల్

ఒకేరోజు నాలుగు చోట్ల చోరీ



చోరీలపై విచారిస్తున్న పోలీసులు

యల్లనూరు : మండల కేంద్రంలో శుక్రవారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. ఒకేసారి బిసి కాలనీలో రెండుచోట్ల, ఎస్‌సి కాలనీ మరో రెండుచోట్ల చోరీకి పాల్పడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. ఎస్‌సి కాలనీలో కూలి పని చేసుకునే పుల్లమ్మ ఇంట్లో కమ్మలు, బంగారు ఉంగరాలు, కాళ్ల గొలుసులు, బియ్యాన్ని చోరీ చేశారు. అలాగే ప్రహ్లాద ఇంట్లో బీరువాను పగలగొట్టి రూ.70వేల నగదు, బియ్యాన్ని ఎత్తు కెళ్లారు. అలాగే బిసి కాలనీలో వెంకయ్య కాలువ రోడ్డు సమీపంలో ఉన్న కట్టెల బట్టి కాల్చుకుంటున్న మనోహర్ ఇంట్లో రూ.20వేల నగదు, మాటీలు, ఉంగరాలు, బంగారం కాళ్ల గొలుసులు వెండిని దొంగలించారు. మోహన్ రాజు కుమారుడు ఓబులేసు ఇంటి తాళం ధ్వంసం చేస్తుండగా పక్కన ఉన్న స్థానికులు బయటకు రావడంతో పరాయ్యారు. గమణించిన బాధితులు లబోదిబోమంటున్నారు. విషయం తెలుసుకున్న పోలీసుల నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

వ్యక్తి ఆత్మహత్య



మృతిచెందిన చౌడప్ప

పామిడి : మండల కేంద్రంలోని జగనన్న కాలనీలో నైటీలు కుట్టుకుంటూ జీవనం సాగిస్తున్న నేసే చౌడప్ప (60) శనివారం సాయంత్రం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చౌడప్ప ఇటీవలే గుండె, కిడ్నీ శస్త్రచికిత్స చేయించుకున్నాడు. అయితే తనకు వచ్చిన రోగాల వల్ల తిరిగి ఆరోగ్యవంతుడు కాలేనని మనోవేదనకు గురవుతూ ఉండేవాడు. ఈనేపథ్యంలో ఇంట్లో వారంతా తన భార్య గ్రామం జల్లిపల్లికి దేవర నిమిత్తం వెళ్లారు. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో సాయంత్రం ఇంటి పైకప్పునకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

సామాజిక ఉద్యమ నాయకుడు నిస్సార్ ఆత్మహత్య

అనంతపురం : సామాజిక ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొంటూ ఉండే నిస్సార్ అహ్మద్ (50) శనివారం నాడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బంధువుల, పోలీసులు సమాచారం మేరకు నగరంలోని యర్రనేల కొట్టాల్లో నివాసముండే నిస్సార్ అహమ్మద్ మూడు దశాబ్ధాలుగా సామాజిక ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొంటూ ఉండేవాడు. అలాంటి వ్యక్తి శనివారం నాడు అనంతపురం నగరంలోని రాజధాని లాడ్జిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆరోగ్య కారణాలతో తాను చనిపోతున్నట్టు రాసిన సూసైడ్ నోట్ ఆయన వద్ద పోలీసులకు లభించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం సర్వజన ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు. టుటౌన్ పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ

రాప్తాడు : మండల కేంద్రంలో గంజాయి విక్రేతలను అరెస్టు చేసినట్లు డీఎస్పీ టి.వెంకటేశులు తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. రాప్తాడు మండలం ప్రసన్నాయపల్లి రైల్వేగేట్ సమీపంలో గంజాయి విక్రేతలు పూల సునీల్‌కుమార్, మండ్ల కుళ్లాయప్ప, పోకల విజయ్‌కుమార్, ఎర్రగుంట చంద్రకాంత్‌రెడ్డి, లడ్డు, గొల్ల క్రాంతికుమార్, బెస్తభాను ప్రకాష్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నిందితులను అరెస్టు చేసి మూడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను కోర్టుకు హాజరుపరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించినట్లు తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన టివి.హర్ష, పోలీసు సిబ్బందిని ఆదేశించారు.

ఓటుహక్కు వినియోగంతోనే నవసమాజ నిర్మాణం

ఓటరు దినోత్సవంలో వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం

ఓటుహక్కు వినియోగంతోనే నవ సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ పి.పద్మశ్రీ సూచించారు. శనివారం ఆర్ట్స్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సిసి ఆధ్వర్యంలో ఓటరు దినోత్సవ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ టవర్‌క్లాక్ మీదుగా కలెక్టరేట్ వరకూ సాగింది. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసిఅధికారి రామంజనేయులు, ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు సుధాకర్, బాలాజీనాయక్, విష్ణుప్రియ, తదితరులు పాల్గొన్నారు. అలాగే నగరంలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల బూత్ లెవెల్ అధికారి డి.సుధాకర్, ప్రధానోపాధ్యాయులు ప్రకాష్‌రావు, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు కె.అల్తాఫ్, తెలుగు వెలుగు సేవా సంస్థ అధ్యక్షులు టివి.రెడ్డి, ఎలిమెంటరీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మిద్దె మురళీకృష్ణ, ఎన్నికల బూత్ లెవెల్ అధికారులు ప్రసన్నలక్ష్మి, హర్షిత, భాను, రవికుమార్, ఫర్హాద్, తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు : జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన ర్యాలీని ఆర్డీఓ శ్రీనివాసులు ప్రారంభించారు. ఆర్డీవో కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ రామలింగ కాంప్లెక్స్ వరకూ సాగింది. అక్కడ మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సీనియర్ ఓటర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌డిఒ విజయలక్ష్మి, తహశీల్దార్ రమాదేవి, మున్సిపల్ కమిషనర్ నయీమ్‌అహ్మద్, ఎంపిపి మాధవి, రెవెన్యూ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్ : పట్టణంలోని ఎస్‌విజిఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డి.జయరామిరెడ్డి, రాజనీతి శాస్త్ర అధ్యాపకులు శ్యామ్, ఎన్‌ఎస్‌ఎస్ పిఒ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

అలాగే స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటు విలువ, వినియోగంపై కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జగన్నాథ్, వెంకటేష్, బాపూజీ, చిక్కబొమ్మప్ప, అధ్యాపకులు, విద్యార్థులు పాలొగొన్నారు.

గుత్తి : జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం గుత్తిలో తహశీల్దార్ డి.ఓబిలేసు ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. తహశీల్దార్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా గాంధీ కూడలి వరకూ ర్యాలీ సాగింది. అక్కడ మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ సాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సి.వెంకటేశ్వర్లురెడ్డి, ఉప తహశీల్దార్లు లలిత, శ్రీలత, కె.సూర్యనారాయణ, ఆర్‌ఐ సందీప్, శ్రీసాయి డిగ్రీ కళాశాల అధ్యాపకులు రంగస్వామి రెడ్డి, స్వరూప, రజిని, శేఖర్, ప్రకాష్, యాగంటి, రామాంజనేయులు, నిజామొద్దీన్, వీఆర్వోలు, వీఆర్‌ఏలు, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : రాయదుర్గంలోని తహశీల్దార్ కార్యాలయంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా సీనియర్ ఓటర్లు, ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అధ్యక్షులు ఇ.రామాంజనేయులు దంపతులను సత్కరించారు. అలాగే కొత్తగా ఓటరుగా నమోదు చేసుకున్న యువతీ, యువకులకు ఓటర్ కార్డులు పంపిణీ చేశారు. తర్వాత ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, తహశీల్దార్ నాగరాజు, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ సుజాతాదేవి, అధికారులు పాల్గొన్నారు.

పుట్లూరు : మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నవర్వహించారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని మోడల్, జడిహెచ్‌ఎస్, కెజిబివి పాఠశాలల్లో వివిధ రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. తర్వాత సీనియర్ సిటిజన్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ మల్లేష్‌ప్రసాద్, ఎంఇఒ శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.



గుత్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

శింగనమల : జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు తహశీల్దార్ సాకే బ్రహ్మయ్య బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ ప్రకాష్‌రావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుప్రియ, కళాశాల లెక్చరర్లు, సీనియర్ అసిస్టెంట్ వెంకటరామిరెడ్డి, విఆర్‌ఒ తాతయ్య, సోషల్ వెల్ఫేర్ అధికారి మధుసూదన్, మహిళా పోలీస్ శిల్ప, విద్యార్థులు పాల్గొన్నారు.



పామిడిలో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

పామిడి : జాతీయ ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని తహశీల్దార్ శ్రీధర్‌మూర్తి ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక కొండాపురం సర్కిల్ పెట్రోల్ బంకు నుంచి ప్రారంభమైన ర్యాలీ అంబేద్కర్ కూడలి వరకూ సాగింది. అక్కడ ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ తేజోష్ణ, సిఐ యుగంధర్, సామాజిక సేవకులు లీలామనోహర్, అంజినాయక్, రెవెన్యూ, సచివాలయ, ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాప్తాడు : జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా తహశీల్దార్ విజయకుమారి ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అధికారులు, ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అటెండర్ బ్రహ్మ, విఆర్‌ఒలు, విఆర్‌ఎలు, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం : జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మండలంలోని ముప్పులకుంట ప్రాథమికోన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి చిత్తప్ప, సీనియర్ నాయకులు వెంకటేశులు, బిఎల్‌ఒ వినోద్, ప్రధానోపాధ్యాయుడు గాజుల ప్రభాకర్, మంజునాథ్, ఓబుళపతి, లలిత, ఓటర్లు అక్కమ్మ, అరుణమ్మ, ఈరన్న, కరెప్ప, చిత్తయ్య, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.